


RNI: APTEL/2015/65959
# క్యాపిటల్ వాయిస్
CAPITAL VOICE TELUGU DAILY
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక
WEB: www.capitalvoice.in

సంపుటి : 11 సంచిక : 07 ఎడిటర్: పిబుచ్చిబాబు అసోసియేషన్ ఎడిటర్ : అనురాధ గుంటూరు గురువారం 12 ఫిబ్రవరి 2026 పేజీలు : 9, వెల: రూ.3/-

# గవర్నర్ ప్రసంగం మధ్యలో వైసీపీ నిరసన

## నినాదాల మధ్య వాకౌట్



**క్యాపిటల్ వాయిస్, అమరావతి:-** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అయితే సమావేశాలు మొదలైన వెంటనే వైసీపీ సభ్యులు నిరసనకు దిగడం సభలో ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉమ్మడి సమావేశానికి హాజరయ్యారు.గవర్నర్ ప్రసంగం కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని, ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పోడియం చుట్టూ చేరి నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని ప్రస్తావించారు.తరువాత గవర్నర్ ప్రసంగం జరుగుతుండగానే వైసీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సమావేశాల సందర్భంగా ఎలా వ్యవహరించాలన్న అంశంపై జగన్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. మండలిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, పార్టీ నేతల ఇళ్లపై దాడులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం. ఇక గవర్నర్ ప్రసంగం అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరగనుంది. సభను ఎన్ని రోజులు నిర్వహించాలి, అజెండా ఏమిటన్న విషయాలపై నిర్ణయం తీసుకోనున్నారు. దాదాపు 20 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. లడ్డూ వివాదం, మెడికల్ కాలేజీల అంశాలపై సభలో చర్చించి ప్రజలకు వివరించాలని నిర్ణయించినట్లు సమాచారం. బీఏసీ సమావేశానికి వైసీపీ దూరంగా ఉండే అవకాశం ఉండటంతో, సభకు పార్టీ హాజరు పై ఆసక్తి నెలకొంది.

# హస్తం హవా!

### 70 శాతం మునిసిపాలిటీల్లో కాంగ్రెస్ ఆధిక్యానికి అవకాశం
### 7 కార్పొరేషన్లలో 5 కాంగ్రెస్ ఖాతాలోకే!
### కరీంనగర్, నిజామాబాద్‌లో బీజేపీకి లభించనున్న మెజారిటీ?
### కేసీఆర్ ఇలాకా గజ్వేల్‌లోనూ క్లిష్టమే
### సిరిసిల్లలో ఎగరనున్న గులాబీ జెండా!




**క్యాపిటల్ వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** రాష్ట్రంలో మునిసిపాలిటీలపైనా కాంగ్రెస్ జెండా ఎగిరే అవకాశం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుని గ్రామీణ తెలంగాణపై పట్టు సాధించిన అధికార పార్టీ.. మునిసిపల్ ఎన్నికల్లోనూ అదే జోరు కొనసాగించే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయి పరిశీలన ప్రకారం.. 70 శాతానికి చేరువలో మునిసిపాలిటీలు, 5 కార్పొరేషన్లలో హస్తం పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభించే అవకాశాలున్నాయి. ఇక మిగిలిన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యర్థి పార్టీలతో కాంగట?గ్రకు గట్టిపోటీ ఎదురుకానున్నట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎసకు.. ఈ ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు దక్కకపోవచ్చని అంచనాలు చెబుతున్నాయి. గత మునిసిపల్ ఎన్నికల్లో దాదాపు 95 శాతానికి పైగా సీట్లు దక్కించుకున్న గులాబీ పార్టీ.. ఈసారి మాత్రం ఉమ్మడి మెదక్ జిల్లా వరకే తన పట్టు కాస్త నిలుపుకోగలిగింది. అయితే ఈ జిల్లాలోనూ మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని గజ్వేల్ మునిసిపాలిటీలో ఆ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు వచ్చే సూచనలు కనిపించడంలేదు. ఇక ఎన్నికలు జరిగిన ఏడు కార్పొరేషన్లలో అన్ని చోట్లా బీఆర్ఎ?సకు ఆశాజనకమైన ఫలితాలు రాకపోవచ్చని తెలుస్తోంది. వీటిలో మూడు కార్పొరేషన్లలోనైతే పార్టీ ఉనికి నామమాత్రమే కానుందని స్పష్టమవుతోంది. కాగా, ఉత్తర తెలంగాణలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను పక్కాగా దక్కించుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన బీజేపీ.. ఈ ప్రాంతంలోని రెండు కార్పొరేషన్లలో అధికార కాంగట(గ్రకు నువ్వా? నేనా? అన్నట్లుగా గట్టిపోటీనిచ్చింది.

# అంబటికి బెయిల్

### మరో కేసులో పిటి వారెంటుకు కోర్టు అనుమతి




**క్యాపిటల్ వాయిస్, గుంటూరు :** మెడికల్ కళాశాలను పిపిపికి ఇవ్వడాన్ని నిరసిస్తూ గత ఏడాది నవంబరు 12న వైసిపి చేపట్టిన ర్యాలీ సందర్భంగా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు నమోదైన కేసులో గుంటూరు కోర్టు బుధవారం మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ కేసులో బెయిల్ లభించిన వెంటనే సత్తెనపల్లిలో 2023లో సంక్రాంతి సంబరాల సందర్భంగా లాటరీ టికెట్ల పేరుతో డబ్బులు వసూలు చేశారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అప్పట్లో చేసిన ఫిర్యాదు నేపథ్యంలో నమోదైన కేసులో అంబటిని పిటి వారెంటు ద్వారా గుంటూరు కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో, పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారన్న కేసులోనూ, గత నెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని దూషించిన కేసులోనూ అంబటికి బెయిలు వచ్చినా మరో కేసులో తాజా పిటి వారెంట్ జారీ కావడంతో జైలు నుంచి విడుదలకు ఆటంకం ఏర్పడింది.

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కీలక నిర్ణయాలు

## 17 రోజులు సభ, 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం



**క్యాపిటల్ వాయిస్, అమరావతి:-** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగానికి వైసీపీ సభ్యులు హాజరై నినాదాలు, నిరసనలు వ్యక్తం చేసి అనంతరం వాకౌట్ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో అసెంబ్లీ నిర్వహణ, అజెండాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రాధాన్యత పొందిన అన్ని అంశాలపై సభ వేదికగా చర్చించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలనాపరంగా కొన్ని ముఖ్య నిర్ణయాలను కూడా ఈ సమావేశాల్లో ప్రకటించే అవకాశం ఉంది. ఈసారి అసెంబ్లీ సమావేశాలను మొత్తం 17 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 14న ప్రభుత్వం 2026--27 వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనుంది. 15, 16 తేదీల్లో మహాశివరాత్రి సందర్భంగా, తదుపరి రోజు సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ జరగనుండగా, 18న ఆర్థిక మంత్రి సమాధానం ఇవ్వనున్నారు. అనంతరం ఎనిమిది రోజుల పాటు శాఖల వారీగా బడ్జెట్ పద్దులపై చర్చించి కేటాయింపులు, ప్రాధాన్యతలను వివరించనున్నారు. అలాగే ఆరు ఆర్డినెన్స్‌లకు ఈ సమావేశాల్లో ఆమోదం తెలపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేల కోసం క్రీడా పోటీలు నిర్వహించేందుకు బీఏసీ నిర్ణయించింది. మార్చి 1, 2, 3 తేదీల్లో సెలవులు ప్రకటించారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సభ నిర్వహించనుండగా, ఉదయం 10 గంటలకు తప్పనిసరిగా జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే సమావేశాల సమయాన్ని పొడిగించే అవకాశముంది. సమావేశాల చివరి రోజు మార్చి 6న అమరావతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు స్పీకర్ నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలపై సభలో ప్రజలకు వివరణ ఇవ్వాలని భావిస్తోంది. ఇటీవల వెలువడుతున్న వివాదాలు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు అసెంబ్లీ వేదికగానే సమాధానం ఇవ్వనున్నారు. మెడికల్ కాలేజీలు, రుషికొండ వంటి అంశాలు కూడా సభలో చర్చకు వచ్చే అవకాశముందని సమాచారం. దీంతో ఈసారి అసెంబ్లీ సమావేశాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

# అవిశ్వాస తీర్మానం నోటీసులలో లోపాలు.. తిరస్కరణకు గురయ్యే అవకాశం..!



**క్యాపిటల్ వాయిస్, న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తప్పించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. అందులోభాగంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు మంగళవారం నోటీసులు అందజేశాయి. అయితే ఆ నోటీసులలో లోపాలు ఉన్నట్లు లోక్‌సభ వర్గాలు వెల్లడించాయి. కొన్ని సందర్భాలను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అందులో ప్రస్తావించినట్లు తెలిపాయి. అయితే ఆ నోటీసును పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా అందులోని లోపాలను సవరించాలని స్పీకర్ ఓం బిర్లా సెక్రటేరియట్‌ను ఆదేశించినట్లు సమాచారం. సవరించిన నోటీసు అందిన తర్వాత నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు. మార్చి 9న బడ్జెట్ సెషన్ రెండో దశ ప్రారంభమైన తర్వాత ఈ నోటీసును లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొనేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాల నేపథ్యంలో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టబోతున్నాయి.

# మోదీ కళ్లలో భయం!

### అమెరికాకు ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారు
### డాటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు
### అమెరికా ఒత్తిడికి ఉక్కిరిబిక్కిరై భరతమాతను అమ్మేశారు: రాహుల్



**క్యాపిటల్ వాయిస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 :-** ప్రధాని మోదీ అమెరికాకు పూర్తి లొంగిపోయారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత-అమెరికా వర్తక ఒప్పందం ద్వారా 140 కోట్ల భారతీయ ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని విమర్శించారు. డాటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాల విషయంలో అమెరికాకు మోదీ సర్కారు దాసోహమైందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో ఉన్న అంశాలకు మోదీ భయపడుతున్నారని అన్నారు. భరతమాతను అమెరికాకు అమ్మేశారు. ఇందుకు సిగ్గు అనిపించడం లేదా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'అమెరికాకు లొంగిపోవడం మీకు సిగ్గుగా అనిపించడం లేదా?' అని నిలదీశారు. బుధవారం లోక్‌సభలో అధికారపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరాల నడుమ, స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ జగదాంబికాపాల్ అడ్డంకుల మధ్య రాహుల్ ప్రసంగిస్తూ ప్రధానిపై నిప్పులు చెరిగారు.

క్యాపిటల్ వాయిస్
CAPITAL VOICE
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక

గురువారం 12 ఫిబ్రవరి 2026

## సంపాదకీయం

# ఏపీ అసెంబ్లీ హిస్టరీలోనే ఫస్ట్ టైమ్!



ఆంధ్రప్రదేశ్ శాసనసభ సరికొత్త టెక్నాలజీతో దూసుకుపోతోంది. పరిపాలనలో డిజిటల్ సంస్కరణలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు అసెంబ్లీ హాజరు ప్రక్రియలో కీలక మార్పుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యేల హాజరు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'ఫేషియల్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) విధానాన్ని ప్రవేశపెడుతోంది. సాధారణంగా ఎమ్మెల్యేలు రిజిస్టర్లలో సంతకాలు చేయడం ద్వారా ఇప్పటి వరకు తమ హాజరు నమోదు చేయించుకుంటున్నారు. ఇప్పటివరకు సభలో ఈ సంప్రదాయమే కొనసాగుతోంది. అయితే ఈ పాత పద్ధతిని సంస్కరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు విధానం ద్వారా సభ్యుల హాజరును తీసుకోనేలా ఆధునిక టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీ అసెంబ్లీలో ఏఐ ఆధారిత హాజరు నమోదు చేయనున్నారు. ఈ విధానంలో సభ్యులు తమకు కేటాయించిన సీట్లో కూర్చున్న తర్వాతే ఏఐ ఆధారిత డిజిటల్ విధానం ద్వారా హాజరు నమోదు అవుతుంది. ఈ ఏఐ టెక్నాలజీ వల్ల సభ్యులు గతంలో మాదిరిగా సభకు ఆలస్యంగా వచ్చి సమావేశాలు ముగియకుండానే వెళ్లిపోవడానికి ప్రయత్నించినా తెలిసిపోతుంది. సభ్యుడు సభలో ఎంత సమయం గడిపింది? పక్కాగా తెలిసే అవకాశం ఉండటంతో ఎమ్మెల్యేలను కంట్రోల్ చేయడం సులువు అవుతుందని అంటున్నారు.

ఏఐ టెక్నాలజీ ద్వారా సభ్యులు ఎంత సమయం సభలో ఉన్నారనేది కచ్చితంగా తెలుసుకోవచ్చని చెబుతున్నారు. సభ్యుడు తనకు కేటాయించిన సీటులో కాకుండా వేరే సీటులో కూర్చున్నా, ఏఐ టెక్నాలజీ ద్వారా అప్రమత్తం చేస్తుంది. సభ్యులు ఎక్కడ కూర్చొవాలో తెలియజేస్తుందని అంటున్నారు. ఇక సభ్యులు హాజరు నమోదు కోసం ఏఐ టెక్నాలజీకి ఉపకరించేలా ఇప్పటికే 175 మంది ఎమ్మెల్యేల ఫొటోలను వెక్టరైజేషన్ ద్వారా సేకరించినట్లు చెబుతున్నారు. వెక్టరైజేషన్ అంటే సభ్యుల రూపురేఖలను గుర్తించేందుకు అవసరమైన కొలతలు తీసుకోవడం అన్నమాట. ఒక్కోఫొటోను 175 వెక్టర్ పాయింట్స్ గా తీసుకుని సాఫ్ట్ వేర్ లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని చెబుతున్నారు. సభలో పీటీజెడ్ (పాన్, టిల్ట్, జూమ్) కెమెరాలను ఏర్పాటు చేశారు. సభ్యుల హాజరు నమోదులో మానవ ప్రమేయం లేకుండానే ఏకాయొకిన డ్యాష్ బోర్డుకు సమాచారం చేరిపోతోందని అంటున్నారు.

ఈ కొత్త విధానాన్ని స్పీకర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి అసెంబ్లీ ఐటీ విభాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. డిజిటల్ అసెంబ్లీ దిశగా ఏపీ వేస్తున్న ఈ అడుగు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. అంతర్జాతీయ స్థాయి పార్లమెంటరీ విధానాలను ఏపీ అసెంబ్లీలో అమలు చేయడం ద్వారా దేశంలోనే ఆదర్శంగా నిలవనుందని అంటున్నారు. నిజానికి మన దేశంలో ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్, కర్ణాటక ముందు వరుసలో ఉన్నాయి. ఏపీ ఇప్పుడు ఈ జాబితాలో చేరుతోంది.

దేశంలో తొలిసారిగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గత ఏడాది జూలైలో నిర్వహించిన వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏఐ హాజరు నమోదు ప్రవేశపెట్టారు. ఆ సమావేశాల్లో పైలట్ ప్రాజెక్టుగా సభ్యులకు పరిచయం చేసినా సత్ఫలితాలు రావడంతో తర్వాత సమావేశాల నుంచి కొనసాగిస్తున్నారు. దీనివల్ల కేవలం అటెండెన్స్ మాత్రమే కాకుండా, ఎమ్మెల్యేలు సభలో ఎంతసేపు ఉన్నారు, ఏ ఏ అంశాలపై మాట్లాడారు, వారి బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంది అనే విషయాలను కూడా ఏఐ టెక్నాలజీ విశ్లేషిస్తోంది. గత నెల ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన స్పీకర్ల సదస్సులో ఈ టెక్నాలజీ కోసం తెలుసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏపీ అసెంబ్లీలోనూ ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇక మన పక్క రాష్ట్రం కర్ణాటకలో సైతం గత ఏడాది జులై నుంచి ఈ టెక్నాలజీని అమలులోకి తీసుకువచ్చారు. మరోవైపు ప్రస్తుత బడ్జెట్ సెషన్స్ లో పార్లమెంటులో కూడా డిజిటల్ అటెండెన్స్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. అయితే ఇక్కడ ఫేషియల్ రికగ్నిషన్‌తో పాటు సీట్ల వద్ద ఉండే బయోమెట్రిక్ (తంబ్ ఇంప్రెషన్) విధానాన్ని కూడా అనుసంధానించారు. అయితే లోక్ సభతోపాటు ఉత్తరప్రదేశ్, కర్ణాటక అసెంబ్లీలలో అమలు చేస్తున్న విధానం కంటే ఏపీలో అమలు చేస్తున్న విధానం కొంత భిన్నంగా ఉండబోతోందని చెబుతున్నారు. ఎమ్మెల్యేలు తమ సీట్లలో కూర్చుంటేనే హాజరు నమోదయ్యేలా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నారు. గతంలో కొందరు ఎమ్మెల్యేలు కేవలం సంతకం చేసి వెళ్ళిపోతున్నారనే విమర్శలు వచ్చేవి. ఈ ఏఐ విధానంతో అటువంటి 'ప్రాక్సీ' లేదా 'ఫేక్' అటెండెన్స్‌కు చెక్ పడుతుందని అంటున్నారు.

# మూడు నగరాలుగా భాగ్యనగరం





GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Greater Hyderabad Municipal Corporation – Reorganisation of Core Urban Region (CURE) – Constitution of (3) three Municipal Corporations, namely Cyberabad Municipal Corporation, Malkajgiri Municipal Corporation and Greater Hyderabad Municipal Corporation – Notification Orders – Issued.

METROPOLITAN AREA & URBAN DEVELOPMENT (GHMC-1) DEPARTMENT

G.O.Ms.No.55 Dated:11.02.2026
Read the following:-

1.G.O.Ms.No.264, MA&UD (MA) Department, dt:03.12.2025.
2.G.O.Ms.No.291, MA&UD (GHMC-1) Department, dt:24.12.2025.
3.G.O.Ms.No.292, MA&UD (GHMC-1) Department, dt: dt.24.12.2025.

<<<<>>>>>

ORDER: -

In the G.O.3rd read above, orders were issued for approving the reorganisation of the Greater Hyderabad Municipal Corporation into (12) Zones and (60) Circles.

**క్యాపిటల్ వాయిస్, 11 ఫిబ్రవరి (హైదరాబాద్):-** హైదరాబాద్ మహానగరాన్ని మూడు నగరాలుగా విభజిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి బుధవారం జీవో నం.55 విడుదల చేసింది.ఇక నుంచి హైదరాబాద్ మూడు కార్పొరేషన్లుగా మారనుంది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ),సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ),హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు గ్రేటర్ హోదా కొనసాగిస్తుండగా, కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజిగిరిలకు మాత్రం కార్పొరేషన్ హోదా మాత్రమే ఇచ్చింది ప్రభుత్వం.

# ముగిసిన తెలంగాణ మున్సిపల్ పోరు



**క్యాపిటల్ వాయిస్, 11 ఫిబ్రవరి (హైదరాబాద్):-** బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. కొన్ని ప్రాంతాలలో చిన్నపాటి ఉద్రిక్తతలు మినహా ఓటింగ్ ప్రక్రియ దాదాపు ప్రశాంతంగానే సాగింది. మొత్తం 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో 12 చోట్ల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 2569 వార్డుల్లో పోలింగ్ నిర్వహించారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డుల్లో కూడా 2 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 412 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. కరీంనగర్ పట్టణంలోని 58వ డివిజన్‌లో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య తలెత్తిన ఘర్షణను అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ ఘటనలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ కూడా ఈ తోపులాటలో గాయపడ్డట్లు తెలుస్తోంది. దొంగ ఓట్లపై ఫిర్యాదు చేసిన తమపైనే పోలీసులు దాడి చేశారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనగా వారు జిల్లా పరిషత్ ముందు రోడ్డుపై బైఠాయించడంతో అక్కడ భారీగా పోలీసు బలగాలు మోహరించాయి.అదే కరీంనగర్ లోని 34వ డివిజన్‌లో దొంగ ఓట్ల కలకలం రేగింది. హుస్సేనీపుర ప్రాంతంలోని ఒక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అక్రమంగా ఓట్లు వేస్తున్న ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకున్నారు. ఒక స్వతంత్ర అభ్యర్థి తరపున వీరు దొంగ ఓట్లు వేస్తున్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఈ అక్రమాల నేపథ్యంలో ఆ బూత్‌లో రీపోలింగ్ నిర్వహించాలని ఎంఐఎం అభ్యర్థి డిమాండ్ చేస్తున్నారు.ఈ నెల 13వ తేదీ ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు మధ్యాహ్నం కల్లా అభ్యర్థుల గెలుపోటములపై ఒక స్పష్టత రానుంది. గెలిచిన అభ్యర్థులు ఈ నెల 16న జరిగే మేయర్, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొంటారు.

# పాల్వంచ పోలీస్ స్టేషన్లో హైటెన్షన్

### మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో పోలీస్ వ్యహరించిన తీరుపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం.



**క్యాపిటల్ వాయిస్, 11 ఫిబ్రవరి (పాల్వంచ):-** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత పాల్వంచ 46వ డివిజన్లలో ఓటు వేయడానికి వచ్చిన మైనారిటీ మహిళా..దొంగ ఓటు వేయడానికి వచ్చిందని ఆరోపించి,ఆ మైనారిటీ మహిళను సుమారు 4 గంటల పాటు పోలీస్ స్టేషన్లో నిర్బంధం చేశారు.ఈ విషయం పై సిఐ సతీష్ ని వివరణ కొరకు సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ఫోన్ చేసి అడగగా దురుసుగా సమాధానం చెప్పాడని.. ఈ విషయంపై కొత్తగూడెం ఎమ్మెల్యే సిపిఐ అభ్యర్థులు, కార్యకర్తలు,పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.దీనికి తోడు బీఆర్ఎస్ అభ్యర్థుల సైతం పోలీసులు అధికార పార్టీ అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తూ వారు కూడా ఆందోళన చేశారు.సిఐ సతీష్ వచ్చి ఈ విషయంపై సమాధానం చెప్పే వరకు కదలను అని పోలీస్ స్టేషన్ ఆవరణలో కార్యకర్తలతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బైఠాయించారు.

# స్టేట్ లెవెల్ సీఎం కప్ పోటీలకు ఎంపికైన సిటీ స్టైల్ జిమ్ భద్రాచలం క్రీడాకారిణిలు




**క్యాపిటల్ వాయిస్, 11 ఫిబ్రవరి (భద్రాచలం):-** సీఎం కప్ సెకండ్ ఎడిషన్లో భాగంగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్ నందు జీవి రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్ కి చెందిన మామిడి భూమిక 69 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, డి మేఘనా చౌదరి, 69 కేజీలు విభాగంలో రజిత పతకం సాధించినట్లు సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారిణిలు ఈనెల 20, 21 వ తేదీలలో, హైదరాబాదులో ఎల్బీ స్టేడియంలో జరిగే సీఎం కప్ స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొంటారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారిణిలను తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి మల్లేష్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ, జీవి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణజి, జాయింట్ సెక్రటరీలు, భవాని శంకర్, గుగులోత్ శోభన్ నాయక్, అబ్దుల్ ఫరూక్, ఎండి అబ్బాస్, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు, పలువురు రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు మరియు సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు, డివి శంకర్రావు , భోగాల వీరారెడ్డి తదితరులు అభినందించారు.

# ప్రకాశం జిల్లాలో టాప్-3లో దర్శి -- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సీఎం ప్రశంసలు



**క్యాపిటల్ వాయిస్,ప్రకాశం జిల్లా:** జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలపై నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలలో దర్శి నియోజకవర్గం రికార్డు సృష్టించి టాప్-3లో స్థానం సంపాదించింది. అభివృద్ధి పనులు, వేగవంతమైన పాలన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ వంటి కీలక అంశాలపై నిర్వహించిన సర్వేల్లో దర్శి నియోజకవర్గం 82 శాతం మార్కులు సాధించి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మూడవ స్థానంలో నిలిచినట్లు నివేదికలు వెల్లడించాయి.డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అందిస్తున్న సమగ్ర పాలన ఫలితంగానే దర్శి నియోజకవర్గం ా గ్రేడ్ సాధించి టాప్-3లో నిలిచిందని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పనితీరుపై ప్రశంసలు కురిపించినట్లు సమాచారం.

క్యాపిటల్ వాయిస్
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక



# పిడుగురాళ్లలో నకిలీ జీఎస్టీ, మైనింగ్ బిల్లుల దందా..!?

## ప్రభుత్వానికి రోజుకు లక్షల్లో నష్టం అన్న ఆరోపణలు !!

**క్యాపిటల్ వాయిస్,పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11:** పట్టణంలో నకిలీ జీఎస్టీ, మైనింగ్ రాయల్టీ బిల్లుల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని ఎగ్గొడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పిల్లుట్ల రోడ్డులో ఉన్న సున్నం బట్టీల నుంచి ప్రతిరోజూ భారీగా లోడ్లు తరలుతున్నప్పటికీ, సరైన బిల్లులు లేకుండానే లారీలు వెళ్లుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక సమాచారం ప్రకారం, పిల్లుట్ల రోడ్డులోని బట్టీల నుంచి రోజుకు సుమారు 40 లారీలు బయలుదేరుతున్నాయి. ఒక్కో లారీ సుమారు 30 టన్నుల సరుకుతో ప్రయాణిస్తుండగా, టన్నుకు సుమారు రూ.600 చొప్పున జీఎస్టీ, మైనింగ్ రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో లారీపై రూ.18,000 ప్రభుత్వానికి రావాల్సి ఉంది. అయితే కొందరు అక్రమార్కులు నకిలీ బిల్లులు సృష్టించి పన్నులు ఎగ్గొడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, కొందరు అవినీతి అధికారులు ఈ వ్యవహారానికి మద్దతుగా నిలుస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజుకు కనీసం 30 లారీలపై పన్నులు చెల్లించకపోతే సుమారు రూ.5.40 లక్షల మేర ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, గుంటూరు రోడ్డులో సుమారు 150 వరకు చిప్స్, సున్నం మిల్లులు ఉన్నాయని, వాటి నుంచి కూడా సరైన బిల్లులు లేకుండా లారీలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు రోడ్డులోనే



రోజుకు దాదాపు 100 లారీలు బిల్లులు లేకుండా ప్రయాణిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంతో పిడుగురాళ్ల పట్టణం నుంచే రోజుకు దాదాపు రూ.15 లక్షల వరకు ప్రభుత్వ ఆదాయం కోల్పోతున్నదని అంచనా వేస్తున్నారు. ఇప్పటికైనా జీఎస్టీ, మైనింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమాలను అరికట్టి ప్రభుత్వానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ... కళాశాలలో తీవ్ర ఉద్రిక్తత !!

**క్యాపిటల్ వాయిస్, నాగార్జున సాగర్ :-** పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ఏపీఆర్ జేసీ విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. జూనియర్--సీనియర్ విద్యార్థులు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో కళాశాల ప్రాంగణం కాసేపు యుద్ధరంగాన్ని తలపించింది. ఈ ఘటనలో ఐదుగురు జూనియర్ విద్యార్థులు గాయపడగా, వెంకటేశ్వర్లు నాయక్ అనే విద్యార్థి కంటికి తీవ్ర గాయం కావడం ఆందోళన కలిగించింది. అతనికి మొదట స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల మధ్య గొడవను అరికట్టేందుకు ప్రయత్నించిన ఒక అధ్యాపకుడికి కూడా గాయాలు కావడం గమనార్హం. విద్యార్థుల ఆకస్మిక దాడులతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కళాశాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో కొంతసేపు ఆందోళన వాతావరణం ఏర్పడింది. భోజన సమయం లో ఒక విద్యార్థికి రెండు అరటిపండ్లు ఇవ్వడాన్ని కారణంగా తీసుకుని వివాదం ప్రారంభమై, అది క్రమంగా ఘర్షణకు దారి తీసిందని ప్రిన్సిపాల్ సరోజిని తెలిపారు. ఘటనలో పాల్గొన్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు ఆమె చెప్పారు. ఏపీఆర్జేసి లో జరిగిన ఈ ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కళాశాల యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# రంగానికి పుట్టినిల్లు చిలకలూరిపేట: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు





**క్యాపిటల్ వాయిస్, గుంటూరు :-** గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో గత ఐదు రోజులుగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా--ఢిల్లీ వేదిక వారి సారథ్యంలో, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం--యడ్లపాడు ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం ముగింపు కార్యక్రమానికి మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చివరి రోజు సందర్భంగా నిర్వహించిన భారీ కళా ప్రదర్శన ర్యాలీలో వందలాది మంది కళాకారులు,విద్యార్థులతో కలిసి ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, నాటకాలకు నంది అవార్డులు ప్రవేశపెట్టి కళాకారులను ప్రోత్సహించే నిర్ణయం తీసుకున్న నాయకుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. అలాగే కందుకూరి కళారత్న పురస్కారాలను కూడా టీడీపీ ప్రభుత్వమే ప్రారంభించిందన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని, వివిధ పాఠశాలలు,కళాశాలలు, అకాడమీలకు చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు భారతీయ సంస్కృతికి అద్దం పట్టాయని తెలిపారు. ఏపీలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగం ఏర్పాటు కోసం ప్రయత్నం రాష్ట్రంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వ సహకారంతో స్థలం, సొంత భవనం మంజూరయ్యేలా కృషి చేస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముందడుగు వేస్తే ఈ ఆలోచన త్వరగా కార్యరూపం దాల్చుతుందన్నారు. కళా రంగానికి పుట్టినిల్లు చిలకలూరిపేట అని, అక్కడ నాటకాలకు లభిస్తున్న ఆదరణ రాష్ట్రంలో మరెక్కడా లేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కళాకారులు ముందుకు రావాలి సోషల్ మీడియా ప్రభావంతో నాటక రంగంపై ప్రజల్లో ఆదరణ తగ్గుతోందని పేర్కొన్న ప్రత్తిపాటి, వినూత్న ఆలోచనలతో ప్రదర్శనలు ప్రజలకు చేరువ చేయాలని కళాకారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం అందించినప్పటికీ, నిధులు సరిపోక డాక్టర్ ముత్తవరపు సురేశ్ బాబు తన సొంత నిధులతో కార్యక్రమం విజయవంతానికి తోడ్పడ్డారని తెలిపారు. అంతర్జాతీయ నాటక సమాజాన్ని ఏపీకి తీసుకురావడంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేశ్ బాబు విశేష కృషి చేశారని, విదేశీ కళాకారులను రాష్ట్రానికి ఆహ్వానించి ఏపీ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో పెంచారని ప్రశంసించారు. గత ఆరు నెలలుగా ఈ ఉత్సవాల కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ ముత్తవరపు సురేశ్ బాబు, కందిమల్ల సాంబశివరావు, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పాండురంగారావు, దండా గోపి, వివిధ కళాపరిషత్ నిర్వాహకులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థిపై దాడి..!!

**క్యాపిటల్ వాయిస్, గుంటూరు /చేబ్రోలు:-** వడ్లమూడిలోని విజ్ఞాన్ విద్యాసంస్థల్లో చదువుతున్న ఒక విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, కొంతమంది విద్యార్థులు బాధితుడిని మాటలతో నమ్మించి కళాశాల సమీపంలోని నిర్జన తోటలోకి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ ముందుగా గుంపుగా చేరిన విద్యార్థులు బాధితుడిపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం.



కర్రలు, చేతులతో తీవ్రంగా కొట్టడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. దాడికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పాత కక్షల కారణంగానా లేదా విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ ఈ స్థాయికి చేరిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన విద్యార్థిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన విద్యార్థులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. విద్యాసంస్థ యాజమాన్యం కూడా ఈ ఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. పోలీసుల పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం నిందితులు ఎవరు? అసలు గొడవకు కారణం ఏమిటి? వంటి మరిన్ని వివరాలు వెలుగులోకి రానున్నాయి.

# రాజీ మార్గమే రాజమార్గం

## లోక్ అదాలత్ అవార్డు అంతిమ తీర్పు: న్యాయమూర్తి వి. విజయ్ కుమార్ రెడ్డి

**క్యాపిటల్ వాయిస్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా:-** రాజీ మార్గమే రాజమార్గం. లోక్ అదాలత్ ఇచ్చే అవార్డు అంతిమ తీర్పు (జడ్జిమెంట్)తో సమానం అని సత్తెనపల్లి మండల న్యాయసేవాదికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.



విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్ ప్రాంగణంలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ హాల్లో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో, సత్తెనపల్లి న్యాయస్థానం పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో రాజీ చేయదగిన కేసులు ఎన్ని ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎక్కువ కేసులు రాజీ ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వేగవంతమైన, తక్కువ ఖర్చుతో న్యాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు థౌషీద్ హుస్సేన్, జె. సుజన్ కుమార్‌తో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓలు పాల్గొన్నారు.

# కోటప్పకొండ మహాశివరాత్రి ఉత్సవాలకు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానించిన కోలా భవాని మణికంఠ

**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా:** రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో కోటప్పకొండలో నిర్వహించనున్న మహాశివరాత్రి తిరునాళ్ల ఉత్సవ మహోత్సవాలకు పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం మాజీ చైర్మన్ కోలా భవాని మణికంఠ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మరియు నరసరావుపేట కృష్ణ బలిజ సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా ఉన్న ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను సస్పెండ్ చేయాలి - సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు

## త్రాగు నీరు అందించాలని కేజీ రోడ్డు పై ఖాళీ బిందెలతో రాస్తారోకో



**క్యాపిటల్ వాయిస్, జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 11 :-** జూపాడు బంగ్లా గ్రామంలోని క్వాటర్స్ కాలాని ప్రజలకు గత మూడు నెలలుగా త్రాగునీటి సౌకర్యం కల్పించడం లో అధికారులు పూర్తిగా విఫలం చెందారని అనేకసార్లు పిజిఆర్ఎస్లో ప్రత్యక్షంగా కలిసి విన్నవించిన దాదాపు 150 కుటుంబాల ప్రజలకు త్రాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహించారని ఆంధ్రప్రదేశ్ కు సాగు తాగునిరందిస్తున్న ప్రాంతంలో త్రాగునీటియొద్దడి నెలకొనడం బాధాకరమన్నారు. తక్షణమే త్రాగునీరు అందించాలని నిర్లక్ష్యం చేస్తున్న సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు, మండల కార్యదర్శి మక్బూల్ బాషా హెచ్చరించారు. జూపాడుబంగ్లా మండల ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా కేజీ రోడ్డుపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించి అధికారులను నిలదీశారు. త్రాగునీటి సమస్య పరిష్కారం చేయకుంటే ఇక్కడ నుండి లేసే ప్రసక్తే లేదని బిస్మించి కూర్చున్నారు. ఎంపీడీవో స్పష్టమైన హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ వేసవికాలం ఇంకా రాకమునుపే గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తిందని త్రాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అనేక చోట్ల బోర్లు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని పాడైపోయిన ట్యాంకులను పడగొట్టారని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నిరత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. అనేక చోట్ల ట్యాంకులను శుభ్రం చేయడం లేదన్నారు. గత మూడు నెలలుగా క్వార్టర్స్ ప్రజలు త్రాగునీరు కావాలని ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని వారు ప్రశ్నించారు. గ్రామాల్లో సంబంధిత ఆర్డబ్ల్యూఎస్,పంచాయతీ సచివాలయ అధికారులు పర్యటన చేయడం లేదని అందువలనే గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ ప్రాంతం నుండే వేలాది గ్రామాల ప్రజలకు త్రాగు సాగునీరు అందుతుందని, అయితే ఈ ప్రాంత ప్రజలకు త్రాగునీరు లేనటువంటి దుర్భరమైన పరిస్థితి నెలకొందన్నారు. అనేక చోట్ల ఫ్లోరైడ్ ఏరియాతో ప్రజలు భయాందోళనలో తాగునీటిని ఉపయోగిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య తలెత్తుతే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా ఎవరు సమస్యలు పరిష్కారం చూపుతారని వారన్నారు తక్షణమే రెండు రోజుల్లో నిరందించి సమస్య పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ మండల నాయకులు తిరుపతయ్య, పుల్లయ్య మధు, రాజు క్వార్టర్స్ కాలనీ ప్రజలు ఉసెనయ్య, నాగమణి, లక్ష్మి దేవి కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ వాయిస్ CAPITAL VOICE TELUGU DAILY
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక
WEB: www.capitalvoice.in
రాయల సీమ వార్తలు

# అమాసమ్మ మృతికి ఆర్.కే. రోజా నివాళి



**క్యాపిటల్ వాయిస్,నగరి :-** రూరల్ మండలం అడవికొత్తూరు గ్రామం అర్జునవాడ ప్రాంతానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు పెద్ద మునస్వామి తల్లి శ్రీమతి అమాసమ్మ అనారోగ్యంతో గతంలో పరమపదించిన విషయం తెలిసిందే. ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ మాజీ మంత్రి ఆర్.కే. రోజా బుధవారం వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అమాసమ్మ చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించిన రోజా, కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. ముఖ్యంగా ఆమె కుమారులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైఎస్ఆర్సిపి మండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా సమ్మెను జయప్రదం చేయండి

**క్యాపిటల్ వాయిస్, నందికొట్కూరు, ఫిబ్రవరి 11 :-** నందికొట్కూరులో జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు,మండల కార్యదర్శి సి . నాగన్న అధ్యక్షులు కొంగర వెంకటేశ్వర్లు, కొంగర లక్ష్మన్న, కే మద్దిలేటి, రైతు సంఘం మండల అధ్యక్షుడు తారేష్, అయ్యన్న తారేష్, అయ్యన్న, నందికొట్కూరు మండలం లోని బొల్లవరం , దామగట్ల, కొణిదెల, బ్రాహ్మణ కొట్కూరు, వడ్డెమాను, మల్యాల, బిజినవేముల, గ్రామాలలో కరపత్రాలు విస్తృతంగా పంచి గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారతదేశాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి తాకట్టు పెట్టారని, వాటి ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు, పెట్టుబడిదారు ప్రయోజనాల కోసం ఉద్యోగ కార్మికులను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. మేము ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను,నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని ఆరోపించారు, 8 గంటల నుండి 12 గంటల పని విధానాన్ని మార్చడం జరిగిందన్నారు, స్కీం వర్కర్స్ కు 26000 వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని రేపు దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా నందికొట్కూరులో ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ నుండి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కావున కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు ,ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి సాజిదాబి, ప్రజా సంఘాల నాయకులు రంగస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

# నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలి

తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



**క్యాపిటల్ వాయిస్,గుంటూరు :-** గుంటూరు తూర్పు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నగర కమిషనర్ మయూర్ అశోక్ను కోరారు. మంగళవారం జీఎంసీ కార్యాలయంలో కమిషనర్ను కలిసిన ఆయన నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత గుంటూరు తూర్పు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వాటి మంజూరుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. నగరంలో ఎన్టీఆర్, గౌతు లచ్చన్న, ఎన్జీ రంగా, అబ్దుల్ కలాం విగ్రహాల వద్ద ఐలాండ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత గుంటూరు, డీఎస్ నగర్ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని విన్నవించారు. బొంగరాలబీడు కబేళా సెంటర్లో ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, ఆనందపేట మరియు బీఆర్ స్టేడియం ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆటోనగర్లో వ్యాపార, కార్మికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతానికి నీటి కనెక్షన్లు అందుబాటు ధరల్లో అందించాలని తెలిపారు.అలాగే కొత్తపేట పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ఆటోనగర్ ప్రాంతంలోని కార్మికుల కోసం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నగర కమిషనర్ను కోరారు.

# మహా శివరాత్రి సందర్భంగా త్రిపురాంతకం, శ్రీశైలం ప్రాంతాలకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి - జెసి పి. శ్రీనివాసులు







**క్యాపిటల్ వాయిస్,దోర్నాల, ఫిబ్రవరి 11:-** మహా శివరాత్రి సందర్భంగా త్రిపురాంతకం, శ్రీశైలం ప్రాంతాలకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్ద దోర్నాలలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్డబీ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోర్నాల--శ్రీశైలం మార్గంలో సుమారు 40 కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ను దృష్టిలో ఉంచుకుని దోర్నాలలో ప్రత్యేక ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో త్రాగునీరు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దోర్నాలలో సుమారు 2 వేల వాహనాలు నిలిపే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు జాయింట్ కలెక్టర్కు వివరించారు. పార్కింగ్ ప్రదేశాల్లో షామియానాలు, కుర్చీలు, త్రాగునీరు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎంఏఎంలో “టెక్ స్ప్రెడ్ - 2026”






**నరసరావుపేట, ఫిబ్రవరి 11, 2026:** నరసరావుపేట మండలం కేసనుపల్లి లోని ఎంఏఎం ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో “టెక్ స్ప్రెడ్ -- 2026” పేరుతో స్టేట్ లెవల్ టెక్నికల్, కల్చరల్ ఒ స్పోర్ట్స్ ఫెస్ట్ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ నరసరావుపేట ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అమెరికాలోని సవ్యయ్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంస్థ అధ్యక్షులు వెంకట్ మద్దినేని హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.పరిశ్రమల్లో జరుగుతున్న ఏఐ విప్లవం గురించి వారు వివరించి, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సరికొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం కొత్త పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు జేఎన్టీయూ ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు ప్రస్తుత పోటీ ప్రపంచంలో లైఫ్ స్కిల్స్తో పాటు టెక్నికల్ స్కిల్స్ కూడా తప్పనిసరిగా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రామారావు వివిధ రంగాల్లో వెలుగులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, వాటిలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై వివరించారు. రాష్ట్రంలోని పలు కళాశాలల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొని పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, షార్ట్ ఫిల్మ్, జనరల్ క్విజ్ వంటి సాంకేతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచారు. సాంస్కృతిక కార్యక్రమాలుగా సోలో, గ్రూప్ డ్యాన్సులు, ఫ్యాషన్ షో నిర్వహించగా, క్రీడా పోటీల్లో కబడ్డీ, త్రోబాల్, టెన్నికోయిట్, చెస్, షాట్పుట్ పోటీలునిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్, గేమ్ స్టాల్స్ మరియు వివిధ వినోద కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి. సాయంత్రం నిర్వహించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

RNI: APTEL/2015/65959
CAPITAL VOICE TELUGU DAILY
క్యాపిటల్ వాయిస్
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక
WEB: www.capitalvoice.in

## ఉత్తరాంధ్ర వార్తలు

# విశాఖపట్నంలో వికలాంగుల క్రీడా కేంద్రం నెలకొల్పాలి

### కేంద్రమంత్రి ని కోరిన ఎంపీ లావు



**క్యాపిటల్ వాయిస్, జాతీయం :-** విశాఖపట్నంలో వికలాంగుల కోసం ప్రత్యేక క్రీడా కేంద్రం ఏర్పాటు చేయాలని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు బుధవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డా. వీరేంద్ర కుమార్‌ను కలిసి విన్నవించారు. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో, విశాఖపట్నంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసిందని ఎంపీ తెలిపారు. ఇందుకోసం విశాఖపట్నం జిల్లా బక్కన్నపాలెం గ్రామంలో 22.64 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటికే గుర్తించినట్లు పేర్కొన్నారు.అలాగే 2025 మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంయుక్తంగా స్థలపరిశీలన కూడా నిర్వహించబడిందని, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని పత్రాలను సమర్పిస్తూ పూర్తి సహకారం అందిస్తున్నదని వివరించారు.విశాఖపట్నం లో వికలాంగుల క్రీడా కేంద్రం త్వరితగతిన స్థాపించబడేలా అవసరమైన ఆర్థిక సహాయం, పరిపాలనా ఆమోదాలు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు. ఈ కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రంలోని వికలాంగ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు లభించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చే అవకాశాలు విస్తరిస్తాయని ఆయన తెలిపారు.

# మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డా. బోటు రామకృష్ణ కు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారం



**క్యాపిటల్ వాయిస్,పార్వతీపురం మన్యం జిల్లా, ఫిబ్రవరి 11:-** పార్వతీపురం పట్టణానికి చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యుడు, సామాజిక సేవా రంగంలో డాక్టరేట్ పొందిన డా. బోటు రామకృష్ణకు ప్రతిష్ఠాత్మకమైన "స్వతంత్ర సమరయోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారం--2026" లభించింది. విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డా. మల్లాది ప్రసాదరావు ఈ పురస్కారాన్ని అందజేశారు. సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న డా. బోటు రామకృష్ణ అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు 99 సార్లు రక్తదానం చేయడంతో పాటు మరెందరో రక్తదాతలను ప్రోత్సహించారు. ఆకలితో ఉన్న అనాథలు, వృద్ధులు, పేదలకు నిరంతరం భోజన సదుపాయం కల్పిస్తూ సహాయం చేస్తున్నారు. పేద విద్యార్థులకు పాఠశాల ఫీజులు, పుస్తకాలు అందజేస్తూ వారి విద్యాభ్యాసానికి తోడ్పడుతున్నారు.అదేవిధంగా 127 మంది అనాథల అంత్యక్రియలకు సహకారం అందించారు. కోవిడ్ సమయంలో ప్రతిరోజు పేదలకు భోజనం, బియ్యం, నిత్యావసర వస్తువులు, మందులు పంపిణీ చేయడంతో పాటు కరోనా వల్ల మృతి చెందిన 48 మందికి అంత్యక్రియలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. విపత్తులు, అగ్నిప్రమాదాల సమయంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేయడమే కాకుండా ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, దోమల నివారణ, మలేరియా వంటి వ్యాధులపై గిరిజనులు, విద్యార్థులు, గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి విశిష్ట సేవలను గుర్తించి డా. బోటు రామకృష్ణకు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారం ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# అరకు కాఫీకి కొత్త ఉత్సాహం : భారత ప్రభుత్వ కాఫీ బోర్డు ప్రయత్నాలు బలోపేతం





**క్యాపిటల్ వాయిస్,2026 ఫిబ్రవరి 11 అరకు :-** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో కాఫీ బోర్డు తన కార్యకలాపాలను ముమ్మరం చేయడం ద్వారా అరకు కాఫీకి కొత్త గుర్తింపు లభిస్తోంది.గిరిజన రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శిక్షణ అలాగే ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉత్తరాఖండ్ జర్నలిస్టుల బృందం అరకులోని కాఫీ నర్సరీలను సందర్శించి, నాణ్యమైన కాఫీ ఉత్పత్తి కోసం అనుసరిస్తున్న శాస్త్రీయ పద్ధతులను పరిశీలించింది.అరకు వ్యాలీ కాఫీని అంతర్జాతీయ బ్రాండ్‌గా మార్చడానికి, అలాగే ఎగుమతులను పెంచడానికి ప్రత్యేక మార్కెటింగ్ వ్యూహాలను అమలు చేస్తున్నారు.నాణ్యమైన కాఫీ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అలాగే గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచడం కోసం ఒక ముఖ్యమైన అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పదకొండు మండలాల్లో భారత ప్రభుత్వ కాఫీ బోర్డు చేపట్టిన కార్యక్రమాలు కొత్త ఊపును సంతరించుకున్నాయి. "అరకు కాఫీ"కి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడం తో పాటూ స్థానిక పండించే వారికి నేరుగా ప్రయోజనాలు చేకూరేలా చేయడానికి అనేక కేంద్రీకృత చర్యలు అమలు చేయడం జరుగుతుంది. ఈ చొరవలో భాగంగా, పత్రికా సమాచార కార్యాలయం ఉత్తరాఖండ్ జర్నలిస్టుల కోసం ఒక ప్రత్యేక మీడియా పర్యటనను ఏర్పాటు చేసింది. ఈ పర్యటనలో భాగంగా, మీడియా ప్రతినిధులను అరకు ప్రాంతంలోని డుంబ్రిగుడ మండలం, ముసిరి గ్రామంలో కాఫీ బోర్డు నిర్వహిస్తున్న కాఫీ నర్సరీకి తీసుకువెళ్లారు. కాఫీ మొక్కలను పెంచే విధానం, ఆధునిక నర్సరీ నిర్వహణ పద్ధతులు, అలాగే వాటి నాణ్యమైన ఉత్పత్తిని నిర్ధారించడానికి అనుసరిస్తున్న ప్రమాణాల గురించి జర్నలిస్టులకు వివరించారు.భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే కాఫీ బోర్డు, అరకు ప్రాంతంలో స్థిరమైన కాఫీ సాగును చురుకుగా ప్రోత్సహిస్తోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన నాటడం సామాగ్రి, సేంద్రీయ సాగు, మెరుగైన ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలపై ఈ ప్రాంతంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కాఫీ బోర్డు మినుములూరు సీనియర్ లైజన్ అధికారి సామల రమేష్ తెలిపారు. రైతులకు క్రమం తప్పకుండా శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం జరుగుతోంది. అలాగే కాఫీ నాణ్యతను, దిగుబడిని మెరుగుపరచడానికి శాస్త్రీయ పద్ధతులనూ అవలంబిస్తున్నారు. ఈ చర్చా సమయంలో అరకు లోయ జూనియర్ లైజన్ అధికారి వి.వి.కె.ఎం.లక్ష్మి సైతం పాల్గొన్నారు.భారత ప్రభుత్వం కాఫీ పండించే రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, మార్కెట్ అనుసంధానం, బ్రాండింగ్ మద్దతును అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో "అరకు వ్యాలీ కాఫీ"ని ప్రోత్సహించడానికి ఒక ప్రత్యేక మార్కెటింగ్ వ్యూహం రూపొందించడం జరిగింది. స్థానిక గిరిజన రైతులు ఈ చొరవను స్వాగతించారు, ఈ ప్రయత్నాలు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుతాయని, అలాగే తమ కష్టానికి తగిన గుర్తింపుని ఇస్తాయని పేర్కొన్నారు. నిరంతర విధానపరమైన మద్దతు, శాస్త్రీయ జోక్యంతో, అరకు కాఫీ దేశంలోనే ఒక ప్రముఖ ప్రీమియం కాఫీ బ్రాండ్‌గా ఎదిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. రానున్న సంవత్సరాల్లో కాఫీ ఉత్పత్తిని పెంచడానికి, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు ప్రాంతంలో కాఫీ ఉత్పత్తి పెంపు, ఎగుమతులు పెంచేందుకు కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనున్నట్లు కాఫీ బోర్డు వెల్లడించింది.

# జగనన్నకు సైన్యంగా కదం తొక్కుదాం : చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

### ధవళేశ్వరం గ్రామ నాయకులతో జిల్లా పార్టీ అధ్యక్షుల ముఖాముఖి



**క్యాపిటల్ వాయిస్,రాజమండ్రి: ఫిబ్రవరి11:-** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని జిల్లా పార్టీ అధ్యక్షులురాజమండ్రి రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ధవళేశ్వరం గ్రామ నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ధవళేశ్వరం గ్రామ పరిధిలోని 5 సచివాలయాలకు కొత్త కమిటీలను నియమించడం ద్వారా పార్టీని గ్రామస్థాయి నుండి పటిష్టం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.2029 ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా అంటిపెట్టుకుని ఉన్న కార్యకర్తలే పార్టీకి అసలైన బలం. గతంలో చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో జగనన్న సైన్యంగా కదం తొక్కాల్సిన సమయం వచ్చింది.ఈ కార్యక్రమంలో గోలి దేవా, ఒంటెద్దు కృష్ణ, సత్యం రమణ, చోల్లంగి సత్యగిరి, మెండా రాజేష్, దేవులపల్లి సరిత రాణి, కళ్యాణి రెడ్డి, పందిళ్ల భాను ప్రసాద్, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, మోర్తా పవన్ మూర్తి, షట్టర్ బాషా, మస్తాన్ బేగ్, గూటం రాజు, నంబూరి రవి, ముత్యాల పోసికుమార్, ముత్యాల జాన్, కరుకు ఇమ్మానియేల్, పేపకాయల చంటి, గునిపే అశోక్, బొడ్డేటి శివాజీ, దాసరి ధర్మ, పట్టపగలు వెంకట లక్ష్మి, బొడ్డు శ్రీను, పుట్టా పరేష్, ఏలూరి కుమార్, విప్పర్తి కుమార్, మేరప రమేష్, దిండి నాగేంద్ర, కొత్తపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వినియోగదారుల అవగాహన సదస్సు







**క్యాపిటల్ వాయిస్, పార్వతీపురం :-** పార్వతీపురం పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్‌లో బుధవారం ఉత్తరాంధ్ర యాత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని--విద్యార్థులకు వినియోగదారుల అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సీసీఐ చైర్మన్ డాక్టర్ అనంత శర్మ ఆదేశాల మేరకు జరిగింది.జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు, జాతీయ వినియోగదారుల సమాఖ్య జనరల్ సెక్రటరీ సాంబరాజు చక్రపాణి ముఖ్య అతిథులుగా పాల్గొనగా, స్థానిక వినియోగదారుల సంఘ అధ్యక్షులు శ్రీహరి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ,"విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో మోసాలకు గురికాకుండా జాగ్రత్తపడగలుగుతారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు, సైబర్ లావాదేవీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడమే ఉత్తరాంధ్ర యాత్ర ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, "ఆహార భద్రత ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి అత్యంత కీలకం. విద్యార్థులు తినే ఆహారంలో నాణ్యత ఉండాలి. ప్యాకెట్ ఫుడ్ కొనుగోలు సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, లైసెన్స్ నంబర్ తప్పకుండా పరిశీలించాలి. అనుమానాస్పదమైన ఆహార పదార్థాలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి" అని సూచించారు.

లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ అధికారి రతన్ రాజు మాట్లాడుతూ తూకాలు, కొలతల్లో జరిగే మోసాలపై అవగాహన కల్పించగా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (దీ×ూ) ప్రతినిధి కృష్ణవీర్ ×ూ× మార్క్, ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు.మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పుస్తకాన్ని, అలాగే ఆహార భద్రతకు సంబంధించిన పోస్టర్లను అతిథులు సంయుక్తంగా ఆవిష్కరించారు. స్థానిక వినియోగదారుల సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాపిటల్ వాయిస్ CAPITAL VOICE TELUGU DAILY
ANDHRA - TELANGANA తెలుగు దినపత్రిక
WEB: www.capitalvoice.in

# పేదల పాలిట వరం 'ముఖ్యమంత్రి సహాయనిధి' - ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

### 23 మంది లబ్ధిదారులకు రూ. 18.42 లక్షల చెక్కులు, ఎల్‌వోసీల పంపిణీ.. పారదర్శకంగా సాయం అందిస్తున్నాం





**క్యాపిటల్ వాయిస్,రాజమహేంద్రవరం (సిటీ), ఫిబ్రవరి 11:-** ఆపదలో ఉన్న పేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరప్రదాయినిలా మారిందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.మొత్తం 23 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 11,42,916 విలువైన చెక్కులతో పాటు, రూ. 7 లక్షల విలువైన రెండు ఎల్ఓసి పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఎమ్మెల్యే గోరంట్ల ప్రసంగంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందాలనే ఉద్దేశంతో, తమ కార్యాలయం ద్వారా పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నేరుగా సిఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తున్నామని తెలిపారు.ఆరోగ్యశ్రీ ద్వారా కవర్ కాని వైద్య ఖర్చులకు ఈ నిధి ఎంతో తోడ్పడుతుందని వివరించారు.ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, కొన్ని ఆస్పత్రుల్లో వైద్యం సరిగ్గా అందడం లేదని, ఈ విషయాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన పాల్గొన్నారు. పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నున్న కృష్ణ, కూరుకూరి కిషోర్, మట్టా శ్రీను, నిమ్మలపూడి రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరిసత్యనారాయణ, కుంచే హనుమంతరావు, సింగవరపు సత్యనారాయణ, పుక్కళ్ళ రాజు, గుర్రపు సత్యనారాయణ తదితర నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# జూటూరు సమీపంలో ఘనంగా పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవం.... పాల్గొన్న మాండ్ర శివప్రసాద్ రెడ్డి



**క్యాపిటల్ వాయిస్, పాములపాడు,ఫిబ్రవరి 11 :-** పాములపాడు మండలం జూటూరు గ్రామ పొలిమేరలో బాణకచెర్ల గ్రామానికి చెందిన రత్నమయ్య నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు మాండ్ర శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కత్తిరించి పంప్‌ను ప్రారంభించి ఇంధన సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు రత్నమయ్య మాట్లాడుతూ.. స్థానిక రైతులు, వాహనదారుల సౌకర్యార్థం అత్యాధునిక ప్రమాణాలతో ఈ పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన సేవలు అందించాలి.ముఖ్య అతిథి మాండ్ర శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సాగు పనుల సమయంలో ఇంధనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ ఈ పంప్ ద్వారా తప్పుతుందని, ఎల్లప్పుడూ నాణ్యమైన ఇంధనాన్ని సరసమైన ధరలకే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రత్నమయ్య, వారి కుటుంబ సభ్యులు, స్థానిక గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు కార్యక్రమం లో సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కన్వీనర్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర యాదవ సంఘమ్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ హరినాథ్ రెడ్డి, వెంకటేశ్వర రావు, భాస్కర్ రెడ్డి, హరిప్రసాద్, సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, గోవిందు, లక్ష్మీకాంత్ రెడ్డి, రుద్రవరం సురేష్ కరీం బాష, నారపరెడ్డి, పూసల కృష్ణ, ఆఫీజ్, మధు, నాగలక్ష్మి రెడ్డి, కన్వీనర్ + మోహన్ రెడ్డి, క్లస్టర్ గిరిశ్వర్ రెడ్డి, రవికాంత్, మూర్తుజావాలి, జాకీర్ హుసైన్, జమీల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ప్రజా అవసరాలే లక్ష్యంగా అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

### 46వ డివిజన్‌లో పర్యటన.. గత పాలకుల వైఫల్యాలపై ధ్వజం

**క్యాపిటల్ వాయిస్,రాజమహేంద్రవరం:ఫిబ్రవరి11:-** నగరంలో ప్రజా అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి



ప్రభుత్వం శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. బుధవారం స్థానిక 46వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులను మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైకాపా హయాంలో కేవలం ప్రధాన రహదారులైన జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్లకే పరిమితమై, అంతర్గత వార్డులలోని ప్రజల కష్టాలను గాలికొదిలేశారని విమర్శించారు.ప్రజలు నివసించే గల్లీల్లో రోడ్లు, డ్రైనేజీలు బాగున్నప్పుడే అది అసలైన అభివృద్ధి అని, తమ ప్రభుత్వం ఆ దిశగానే అడుగులు వేస్తోందని తెలిపారు. గత ఎంపి తన సొంత వార్డును కూడా పట్టించుకోలేదని ఎద్దేవా చేస్తూ, కూటమి అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే రూ. 280 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని వెల్లడించారు. ఖేలో ఇండియా కింద స్టేడియం అభివృద్ధికి రూ. 14 కోట్లుమంజూరయ్యాయని, రివర్ ఫ్రంట్ పనులు కూడా వేగవంతం చేశామని చెప్పారు.మహనీయుడు కందుకూరి వీరేశలింగం పంతులు జన్మగృహాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ పురందేశ్వరి తమ లాడ్స్ నిధుల నుంచి రూ. 50 లక్షలు కేటాయించగా, మరో రూ. 50 లక్షల నిధులను జోడించి మొత్తం రూ.కోటితో మరమ్మతులు చేపడుతున్నట్లు ప్రకటించారు.వైసిపి విధ్వంసకర పాలన పోయి, కూటమి నిర్మిత పాలన మొదలైందని ప్రజలు గమనిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో స్థానిక టిడిపి, జనసేన, బిజెపినాయకులు కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ధవళేశ్వర క్షేత్రంలో భక్తి ప్రభంజనం వేంకటేశ్వరుని హుండీ ఆదాయం రూ. 3.37 లక్షలు

**క్యాపిటల్ వాయిస్, ధవళేశ్వరం: ఫిబ్రవరి 11:-** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ పద్మావతి గోదా ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలను బుధవారం ఘనంగా లెక్కించారు. గత ఆరు నెలల కాలానికి సంబంధించి భక్తులు మొక్కుబడిగా సమర్పించుకున్న కానుకలను దేవస్థానం చైర్మన్, కార్యనిర్వహణ అధికారి , కూటమి నాయకుల సమక్షంలో లెక్కించారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగ సురేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఆరు నెలల కాలంలో స్వామి వారికి హుండీ ద్వారా రూ. 3,37,022 (మూడు లక్షల ముప్పై ఏడు వేల ఇరవై రెండు రూపాయలు) నగదు ఆదాయం సమకూరింది. ఆలయ చైర్మన్ నీలి కోటేశ్వరరావు పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా ఈ లెక్కింపు ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, టిడిపి గ్రామ అధ్యక్షులు పండూరి అప్పారావు, జనసేన నాయకులు యడ్ల మహేష్, నాళ్ళ రమేష్,చినరవణ, సురేష్ , బొక్క శ్రీను, భగవాన్ పాండురంగారావు, మద్దుల రమణ మూర్తి బి.రామకృష్ణ,స్థానిక కూటమి నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# మహిళలే ప్రకృతి వ్యవసాయానికి ముందుండాలి - జెండర్ స్టేట్ కన్సల్టెంట్ అరుణ

### కుటుంబ ఆర్థికాభివృద్ధికి ఇది బంగారు బాట

**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, ఫిబ్రవరి 11:** రాష్ట్రంలోని ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జెండర్ స్టేట్ కన్సల్టెంట్ అరుణ పిలుపునిచ్చారు. ఎడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో మహిళా రైతు



కోటేశ్వరమ్మ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్ ప్రశాంతి, పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి హాజరయ్యారు.అరుణ మాట్లాడుతూ కుటుంబాల ఆర్థిక స్వావలంబనలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు వ్యవసాయంలో ముందుండి పనిచేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ ఆదాయం పెరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా వనరులను సామూహికంగా సమకూర్చుకోవచ్చని, సమయం మరియు శ్రమ ఆదా అవుతాయని వివరించారు. కోఆర్డినేటర్ ప్రశాంతి మాట్లాడుతూ రసాయన రహిత పద్ధతుల్లో పండించిన ఆహారం కుటుంబాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. గోపాలపురం గ్రామంలో మహిళా సంఘాలతో కలిసి రోల్ ప్లే నిర్వహించి, ప్రకృతి వ్యవసాయం చేయకపోతే కలిగే నష్టాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి మాట్లాడుతూ ప్రతి మహిళ పెరటి తోటలు ఏర్పాటు చేసి ప్రకృతి పద్ధతులు అనుసరిస్తే "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్"సాధ్యమవుతుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం భూమి సారాన్ని పెంచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని, నీటి వినియోగాన్ని తగ్గిస్తుందని వివరించారు.అనంతరం కోటేశ్వరమ్మ తన క్షేత్రంలో 15 రకాల అంతర పంటలు సాగు చేస్తున్న విధానాన్ని వివరించారు. ఈ విధానంతో సంవత్సరం మొత్తం నిరంతర ఆదాయం పొందుతున్నట్టు తెలిపారు. చీడపీడల ఉధృతి తక్కువగా ఉండటంతో పెట్టుబడి ఖర్చులు పూర్తిగా తగ్గినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్స్ మన్విత, హేమ, జిల్లా అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్ రాజు, సౌజన్యలక్ష్మి, నందకుమార్, సైదయ్య, అప్పలరాజు, మేరీ, భవాని రాజు, మహిళా సంఘాల సభ్యులు, రైతులుపాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుగా రూ.1,200 కోట్లు విడుదల

### మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే డా. చదలవాడ కృతజ్ఞతలు



**క్యాపిటల్ వాయిస్, నరసరావుపేట :-** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుగా రూ. 1,200 కోట్లు విడుదల చేసినందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు నరసరావుపేట ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కులను కాపాడుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల హక్కులను నిర్లక్ష్యం చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. దీంతో విద్యార్థులపై ఆర్థిక భారం పడటమే కాకుండా వారి విద్యాభవిష్యత్తు కూడా ప్రమాదంలో పడిందన్నారు. రూ. 1,200 కోట్లు విడుదల చేయడం ద్వారా లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలకు భారీ ఊరట లభించిందన్నారు.రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవడంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు.

# యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు.

**క్యాపిటల్ వాయిస్, బాపట్ల :-** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బాపట్ల వారు బాపట్లలో తమ కార్యాలయంలో 16-02-2026 సోమవారం నుండి జూనియర్ బ్యూటీషియన్ కోర్సు నిర్వహిస్తున్నామని యూనియన్ బ్యాంక్ ఆర్ సెటి అధికారి బెనర్జీ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18-50 సం.ల గ్రామీణ మహిళలకు ఉచితంగా 30 రోజుల పాటు శిక్షణ అందించనున్నారని, ఈ శిక్షణకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు బాపట్లలో గల శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చుని,శిక్షణకు వచ్చే అభ్యర్థులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తారు అన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బాపట్ల డోర్ నెం.6-10-132, 1వ అంతస్తు, వార్డు 15, అలపర్తి నాగేశ్వర రావు బిల్డింగ్, శృంగారపురం, బాపట్ల సెల్: 9985437891.ను సంప్రదించాలని అన్నారు.

# కార్యకర్త భౌతిక దేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి



**క్యాపిటల్ వాయిస్, నరసరావుపేట :-** నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి నాగేంద్రం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసిన పల్నాడు జిల్లా వైఎస్సార్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం నాగేంద్రం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట మండల ఎంపీపీ మురబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, మూరే రవీంద్ర రెడ్డి, యాంపాటి వెంకటప్పరెడ్డి తదితర వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్ వినోద్ కుమార్

## నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది.

**క్యాపిటల్ వాయిస్,కర్లపాలెం :-** గుండెపోటుతో మృతి చెందిన కర్లపాలెం మండలం చింతాయపాలెం పంచాయతీ రాళ్లచెరువు సమీపంలో నివాసం ఉంటున్న నిరుపేద నక్కా నాగేశ్వరరావు కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పరామర్శించారు. రాళ్ల చెరువు సమీపంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న ఎస్టీ యానాది కుటుంబాల నివాస ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. నాగేశ్వరరావు మృతితో రోదిస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఆ కుటుంబంతో కొంత సమయం గడిపారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నిత్యవసర సరుకులు, దుస్తులు, ఒక బస్తా బియ్యం, కూరగాయలు, కిచెన్ కిట్లు, దుప్పట్లు, రగ్గులు, టార్పాలిన్ పట్టలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిగిలిన నాలుగు కుటుంబాలకు కిచెన్ కిట్లు, దుప్పట్లు, రగ్గులు, టార్పాలిన్ పట్టలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. పంట కాల్వలో చేపలు వేట, పొలాలలో ఎలుకలు పట్టి జీవనం సాగించే నాగేశ్వరరావుకు రోజుకు రూ.300 ల నుంచి రూ.400లు సంపాదించే వాడని కుటుంబ సభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్వ గట్టు సమీపంలోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా, కుమారుడు నాగేంద్రబాబు డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడని ఆయనకు చెప్పారు. గుండెపోటు రావడంతో మృతి చెందడం, వైద్యం కొరకు ఆసుపత్రికి, పేదరికంతో ద్విచక్ర వాహనంపై తరలింపుపై ఆయన ఆరా తీశారు. ఏ సమస్య వచ్చినా, ఇబ్బంది వచ్చినా, నేను మీకు ఉన్నాను, నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చు, ఫిర్యాదు చేయవచ్చని ఆయన కోరారు, మృతి చెందిన నాగేశ్వరరావు మరణ ధ్రువీకరణ



పత్రాన్ని సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. వితంతు పింఛన్ మంజూరు చేస్తామని తెలిపారు. ఆ కుటుంబాలకు నివాస స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆర్డిఓ పి గ్లోరియా, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, తహసీల్దార్ శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

# నరసరావుపేటలో హనువాయమ్మకు డాక్టర్ గోపిరెడ్డి నివాళులు



**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, నరసరావుపేట :-** పట్టణంలోని 27వ వార్డు కొత్తపల్లి వెంకటేష్ నాయనమ్మ కొత్తపల్లి హనువాయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట కాకుమాను కోటిరెడ్డి, గోగుల మనోహర్ యాదవ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్‌కు కొత్త దిశ -- బాపట్ల అసోసియేషన్‌కు నూతన నాయకత్వం

## అధ్యక్షుడిగా అంకమ్మ చౌదరి ఏకగ్రీవ ఎన్నిక



**క్యాపిటల్ వాయిస్: బాపట్ల :-** బాపట్ల క్రికెట్ అసోసియేషన్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. అధ్యక్ష పదవికి ఎర్ర అంకమ్మ చౌదరిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి నూతన కమిటీని ప్రకటించారు. సీనియర్ సలహాదారు గంట అంజిబాబు మాట్లాడుతూ, గత కమిటీ కాలపరిమితి ముగియడంతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి కొత్త బృందాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా బీ. జేరామ్ రెడ్డి, కార్యదర్శిగా బిల్లా స్టాండ్లీ విమల్ుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎలవల నరేష్, ఖజాంచీగా అబ్దుల్ కరీం, బాధ్యతలు స్వీకరించారు. గౌరవ అధ్యక్షులుగా బందా బాబు, సిహెచ్ రోశయ్యలను నియమించగా, సభ్యులుగా పఠాన్ రాజేష్, ఎం. శ్రీనివాసరావు, కొట్ర వెంకటరావు, కొమరోలు శ్రీనివాసరావులను ఎంపిక చేశారు. ఎన్నికల అనంతరం నూతన అధ్యక్షుడు అంకమ్మ చౌదరిని కమిటీ సభ్యులు పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో యువ క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ బలోపేతానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత కమిటీ సహకారంతో నెట్స్ ప్రాక్టీస్‌కు గ్రౌండ్ కేటాయించిన ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ వినోద్ కుమార్‌లకు నూతన కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. క్రికెట్ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు తమ మార్గదర్శకత్వం అందించాలని ఆయన కోరారు.

# స్వర్ణ పోర్టర్ లో ఇంటి పన్ను చెల్లించాలి ....ఎంపీడీవో అద్దురి శ్రీనివాసరావు



**క్యాపిటల్ వాయిస్, కర్లపాలెం :-** ఇంటి పన్నును నూరు శాతం వసూలు చేయాలని ఎంపీడీవో అద్దురి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పంచాయతీ లో పంచాయతీ సిబ్బంది తో కలసి ఇంటి పన్నులు వసూలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా..శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి ఆన్ లైన్ చేయడం వల్ల ప్రజలందరూ ఇంటి పన్నును స్వర్ణ పంచాయతీ పోర్టల్ లో కట్టాలని తెలియజేశారు. రశీదు కూడా ఆన్ లైన్ లోనే వస్తుందన్నారు. ఈ నెల 15 లోపు అందరూ ఇంటి పన్ను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కళ్యాణ్ ,పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# యువతలో ఏకాగ్రత, సమతుల్యతకు నాంది - రోటరీ స్లో సైక్లింగ్ పోటీలు

## విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన రోటరీ ప్రతినిధులు





**క్యాపిటల్ వాయిస్: బాపట్ల :-** యువజన వారోత్సవాల సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన స్లో సైక్లింగ్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. రోటరీ మండపంలో జరిగిన ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్లో సైక్లింగ్ వంటి క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, నియంత్రణ, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత శారీరక–మానసిక వికాసానికి క్రీడలు అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సీనియర్ విభాగంలో పి. గీతిక (లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్) ప్రథమ స్థానం, పి. వాణి (బాపట్ల పబ్లిక్ హైస్కూల్) ద్వితీయ స్థానం, జి. లాస్య (లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్) తృతీయ స్థానం సాధించారు. జూనియర్ విభాగంలో అద్వైత (అక్షర విద్యా భవన్) మొదటి బహుమతి, అక్షర (లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్) రెండో బహుమతి, యు. కార్తిక (లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్) మూడో బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావు, యువజన వారోత్సవాల చైర్మన్ ఎస్.రమేష్ బాబు, ఇ.హరిబాబు, సీనియర్లు బుర్లె రామసుబ్బారావు, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం క్రమబద్ధంగా, విజయవంతంగా ముగిసింది.

# వ్యర్థాల వేరు చేయడంపై దృష్టి పెట్టాలి

## మున్సిపల్ అధికారులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ సూచనలు



**క్యాపిటల్ వాయిస్,అమరావతి, ఫిబ్రవరి 11:-** గత స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెలుగుచూసిన లోపాలను సరిదిద్ది ఈసారి జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మున్సిపల్ అధికారులకు పిలుపునిచ్చారు. అమరావతిలోని కార్పోరేషన్ కార్యాలయం నుంచి బుధవారం గుంటూరు, అనంతపురం రీజియన్ల మున్సిపల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు నెలరోజుల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ, ముందస్తుగా పారిశుద్ధ్యం మరియు వ్యర్థాల నిర్వహణ పనులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోర్స్ సెగ్రిగేషన్ (వ్యర్థాల వేరు చేయడం), పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, నాళాల శుభ్రత, పాఠశాలలు, పార్కులు, పర్యాటక ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ఏడాది వివిధ విభాగాల్లో వచ్చిన నెగెటివ్ మార్కుల కారణంగా ర్యాంకులు తగ్గాయని గుర్తుచేసిన ఆయన, ఈసారి వాటిని జీరో స్థాయికి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలవల్లో చెత్త పేరుకుపోకుండా చూడడం, ఇళ్ల వద్దే తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయించడం, ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్), సీబీ (కెపాసిటీ బిల్డింగ్) కార్యక్రమాలను చురుకుగా అమలు చేయాలని తెలిపారు. ప్రజలను భాగస్వాములుగా మార్చేలా ఏఐఐఎల్ఎస్‌జీ, వాష్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు మార్కులు 500 నుంచి 1000కు పెంచిన నేపథ్యంలో పనితీరు మెరుగైతే ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. నగర సుందరీకరణతో పాటు సముద్ర తీరాలు, నది ఒడ్డున ఉన్న పట్టణాల్లో పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు.పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి నిధుల కొరత లేదని, అవసరమైతే కొత్తవాటిని మంజూరు చేస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాఠశాలలు, ప్రైవేట్ ప్రదేశాల్లోని టాయిలెట్స్‌లో మహిళలు, వికలాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, శానిటరీ న్యాప్కిన్స్ మరియు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి మున్సిపాల్టీకి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ పరిపాలనా శాఖ రీజినల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**క్యాపిటల్ వాయిస్, కర్లపాలెం :-** కర్లపాలెం మండలం నర్రావారిపాలెం గ్రామంలో పెనుయలు మినిస్ట్రీస్ ఆధ్వర్యం లో ఆశ్రమం హ్యాండ్ ఆఫ్ హోప్ ద్వారా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆశ్రమం హ్యాండ్ ఆఫ్ హోప్ నిర్వాహకులు జయరాజ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలను అవసరమైన వారికి అందించడానికి తామెప్పుడూ ముందుంటామన్నారు. అనంతరం పెనుయేల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు కాగిత డేవిడ్ మాట్లాడుతూ తుమ్మలపల్లి కట్టవాద పెదపులుగువారిపాలెం మర్రికట్టవ గణపవరం, పేరలి తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు నిర్వహించామన్నారు. ఈ శిబిరం ద్వారా దాదాపు 300 మందికి వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళజోళ్ళు రక్త పరీక్షలు ఎక్సరే, ఈసీజీ వంటివి సేవలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటుకు సహకరించిన ఆశ్రమం హ్యాండా పోపు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ భరత్, డాక్టర్ దుర్గా శ్రీ, ,డాక్టర్ గౌరీ లిఖిత, గ్రామస్తులు నంగు పోలు రెడ్డి ఆరాధ్యుల గోపాలరావు, నర్రా మణికంఠ, యల్లావుల వేణుగోపాల్, మోపిదేవి సుబ్బారావు,యారం దేవుని దాసు,తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండ తిరునాళ్లకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు : గుంటూరు రేంజ్ ఐజీ





**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, నరసరావుపేట :-** భక్తులు ప్రశాంత వాతావరణంలో శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకునేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 15న (ఆదివారం) జరగనున్న కోటప్పకొండ తిరునాళ్ల ఉత్సవాల నేపథ్యంలో గుంటూరు లోని ఐజీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఏర్పాట్లపై వివరించారు.ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలని ఐజీ సూచించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులతో సున్నితంగా వ్యవహరిస్తూ, ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్లపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలుపుకునేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు.వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రభల ప్రదర్శన స్థలాలు, దర్శన మార్గాల్లో జనసందోహం నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించి ఈ పండుగను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.ప్రతి సిబ్బందికి కమ్యూనికేషన్ సెట్లు అందజేస్తున్నందున ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే సెక్టార్ ఇన్‌చార్జ్‌కు సమాచారం అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కోటప్పకొండ తిరునాళ్లకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఎస్పీ ఐజీకి వివరించారు.రాష్ట్ర పండుగ హోదా కలిగిన ఈ తిరునాళ్లకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ నుంచి కూడా వేలాది మంది భక్తులు వచ్చే అవకాశముందని తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంతమాగులూరు వైపుల నుంచి వచ్చే మార్గాలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, చెక్‌పోస్టుల వివరాలను వెల్లడించారు. ప్రధాన కూడళ్ల వద్ద డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, బందోబస్తుకు హాజరయ్యే సిబ్బందికి వసతి వంటి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ జె.వి. సంతోష్ (అడ్మిన్), నరసరావుపేట ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం. హనుమంతరావు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడు కుటుంబానికి రెడ్ క్రాస్ ఆదరణ.



**క్యాపిటల్ వాయిస్, బాపట్ల :-** కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలో మంగళవారంమృతి చెందిన నక్క నాగేశ్వరరావు కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా కొంత ఆదరణ ఇచ్చినది అని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు.బుధవారం చింతాయపాలెం లోని స్థానిక రాళ్ల చెరువు దగ్గర ఉన్న ఆ కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా రెడ్ క్రాస్ బృందము పరామర్శించి వారికి రెడ్ క్రాస్ తరఫునుంచి బియ్యం, నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, బట్టలు, టార్పులిన్ పట్టా మొదలుగున్నవి అందించారు.ఈ సందర్భంగా అక్కడ ఉన్న మిగిలిన నాలుగు కుటుంబాలకు కూడా అవి అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆ కుటుంబాలకి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ కుంభా శ్రీదేవి,ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణభట్టు, మండల చైర్మన్ఇన కొల్లు పోలీసు రావు, రెడ్ క్రాపాల్గొన్నార,తదితరులు,పాల్గొన్నారు.

# సహృదయంతో ఫ్రెండ్స్ యూత్ స్పందన

## నగేష్ మట్టి ఖర్చులకు ఆర్ధిక సహాయం



**క్యాపిటల్ వాయిస్, కర్లపాలెం :-** సమాజంలో మానవతా విలువలు కోల్పోవడంతో పాటు డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ పేదవారు చనిపోతే ఒకలా, ఆర్థికవంతులు చనిపోతే మరోకల వ్యవహరిస్తున్న తీరు సమాజంలో తల దించుకునే పరిస్థితిని తీసుకు వస్తుందని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బంద్రెడ్డి గోపి అన్నారు. కర్లపాలెం మండలం చింతయపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లచెరువుకు చెందిన నక్క నాగేష్ గుండెపోటుతో మరణించి అంత్యక్రియలు చేయడానికి కూడా ఆర్ధిక స్తోమత లేకపోవడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్ధిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బంద్రెడ్డి గోపి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మానవతా విలువలు పడిపోతున్నాయని ప్రతి ఒక్కరు డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ ఎవరెలా పోతే మనకేమి లే అనే విధంగా ఆలోచన చేయడం సరైన విధానం కాదన్నారు. మృతదేహాన్ని ఆటోలో ఇంటికి తరలించేందుకు డబ్బులు కూడా లేకపోవడంతో 13 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లే విషయం ప్రతి ఒక్కరిని బాధించిందన్నారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి ఖర్చులకు కొంతమేర ఆర్ధిక సహాయం అందించామని, రాజకీయాలకు అతీతంగా నాయకులు ఈ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు, అధికార యంత్రాంగం కూడా అన్ని విధాల సహాయ సహకారాలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తీసుకెళ్తున్న విషయంలొ బాపట్ల జిల్లా కలెక్టర్ స్పందించి మరొకసారి ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా మహాప్రస్థానం వాహనాన్ని అప్పటికప్పుడే ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం మంచి విషయమని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ తరుపున జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, బొగ్గవరపు శివ, బీమా కోటేశ్వరరావు, మద్దిబోయిన గోపి, నైముల్లా, విన్నకోట శ్రీనివాసరావు,కోడిరెక్క రవి, సాల్మన్ రాజు, నరాల శెట్టి సుబ్బారావు ఉన్నారు.

# బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు పంజా



**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, అచ్చంపేట:-** స్థానిక మండల కేంద్రం లో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు పంజా విసిరారు. సీతారాంపురం వాగు వద్ద నిల్వ ఉంచిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.మొత్తం 82 బస్తాలు (37.25 క్వింటాళ్లు) బియ్యం పట్టుబడినట్లు అధికారులు తెలిపారు.ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న ముంద్రు వీరభద్రరావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు, ఈసీ యాక్ట్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.గత వారం భట్టిప్రోలులో 404 బస్తాల రేషన్ బియ్యం సీజ్ చేసిన విజిలెన్స్ బృందం, తాజాగా అచ్చంపేటలోనూ వరుస దాడులు నిర్వహించడం గమనార్హం. రేషన్ మాఫియాను అరికట్టేందుకు గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ బృందం విస్తృత తనిఖీలు చేపడుతోంది.

Edited, Printed, Published and Owned by Panguluri Butchibabu and Printed at Uday Printers, D.No.26-39-66, 7th Lane, Chaitanya Nagar, AT Agrabharam, Guntur - 522004. A.P. and Published 7-87, Macharla Road, Oppicherla, Karempudi Mandal, Guntur Dist - 522614. A.P. Cell : 9908012781 email: capitalvoicedaily@gmail.com RNI : APTEL/2015/65959

# విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరం



**క్యాపిటల్ వాయిస్, కర్లపాలెం :-** విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు- వినియోగదారులకు రూ.11.64 లక్షల జరిమానా : విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా పర్యవేక్షణ ఆంజనేయులు ఆధ్వర్యంలో కర్లపాలెం సెక్షన్ లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. 25 మంది అధికారులు 150 మంది సిబ్బంది 72 బృందాలుగా ఏర్పడి 4890 సర్వీస్ లను తనిఖీలు చేశారు. అనుమతించిన లోడు కంటే అదనపులోడు వాడుతున్న 361 మందిని గుర్తించి రూ. 9.89 లక్షలు, అనుమతి ఇచ్చిన కేటగిరీలో కాక ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుచున్నా ఎనిమిది మందికి రూ. 62000, విద్యుత్ చౌర్యం చేస్తున్న 21 మందికి రూ. 1.07 లక్షలు అపరాధ రుసుము విధించారు.విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఎం. భాస్కర్ రావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కరరావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాము అన్నారు. తనిఖీల్లో బాపట్ల డిఇ టి. శ్రీనివాసరావు, చెరుకుపల్లి డి సురేష్, రేపల్లె డి ఈ శ్యామ్ సుధాకర్, చుండూరు డి ఈ రాజశేఖర్ బాబు, విద్యుత్ విజిలెన్స్ డి ఈ విజయ శ్రీనివాస్, బాపట్ల డివిజన్ పరిధిలోని ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి



**క్యాపిటల్ వాయిస్,నరసరావుపేట ;-** తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి, ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి. శివకుమారి, షేక్ శిలార్ మాసూద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా తరలివచ్చే నేపథ్యంలో ప్రతి ఏడాది ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. మున్సిపల్, పోలీస్, ఆర్టీసీ అధికారులు అర్ధరాత్రి వరకు సౌకర్యాలు బాగానే కల్పిస్తున్నప్పటికీ, ఉదయం నుంచి పనిచేసిన సిబ్బంది అర్ధరాత్రి తర్వాత విధుల్లో లేకపోవడంతో భక్తులు త్వరగా ఇళ్లకు చేరాలనే ఆతృతలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తున్నారని చెప్పారు.దీంతో అర్ధరాత్రి తర్వాత ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడి,ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సిబ్బందిని మూడు షిఫ్టులుగా నియమించాలని సూచించినట్లు తెలిపారు.

# దశదిన కార్యక్రమం లో పాల్గొన్న డాక్టర్ కోడెల శివరామ్



**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, నరసరావుపేట :-** నియోజకవర్గం రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి తాతయ్య భార్య గరికపాటి రమాదేవి దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ హాజరై, ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ కోడెల శివరామ్, ఈ దుఃఖ సమయంలో పార్టీ తరపున తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టాన్సిల్స్ ఆపరేషన్ సమయంలో 12 ఏళ్ల బాలుడు అనుమానాస్పద మృతి !!

**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, నరసరావుపేట :-** పల్నాడు జిల్లా నరసరావుపేటలో టాన్సిల్స్ ఆపరేషన్ సమయంలో 12 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని రేకెత్తించింది. నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో టాన్సిల్స్ శస్త్రచికిత్స జరుగుతుండగా 12 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై వైద్య నిర్లక్ష్యం ఉందని ఆరోపిస్తూ బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామానికి చెందిన కె. సంతోష్ కుమార్ (12) టాన్సిల్స్ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సత్తెనపల్లి రోడ్డులోని ఈఎన్టీ నిపుణుడు



డాక్టర్ రామ్మోహన్ రెడ్డి అతడిని నరసరావుపేటలోని చెరుకూరి ఆసుపత్రికి తరలించి టాన్సిలెక్టమీ శస్త్రచికిత్స చేపట్టినట్లు సమాచారం. ఆపరేషన్‌కు ముందు మత్తుమందు ఇచ్చిన వెంటనే బాలుడికి తీవ్ర అస్వస్థత కలిగి, అనంతరం మృతి చెందినట్లు తెలిసింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం,అనుభవం లోపించడం వల్లే తమ కుమారుడు చనిపోయాడని తండ్రి రాంబాబు, బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆసుపత్రి రికార్డులు, వైద్యుల అర్హతలు, శస్త్రచికిత్స సమయంలో అనుసరించిన విధానాలపై సమాచారం సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, అనస్థీషియా నిపుణుల అందుబాటు, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై చర్చ మొదలైంది. చిన్న శస్త్రచికిత్సలకూ ప్రాణాపాయం ఏర్పడవచ్చన్న ఆందోళన రోగుల్లో వ్యక్తమవుతోంది. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆసుపత్రి లైసెన్సు, వైద్యుల అర్హతలపై పరిశీలన చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కోటప్పకొండ తిరుణాళ్ళ మహోత్సవాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేయాలి - ఎమ్మెల్యే చదలవాడ

**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా, నరసరావుపేట :-** నియోజకవర్గంలోని ప్రసిద్ధ కోటప్పకొండ తిరుణాళ్ళ మహోత్సవాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పిలుపునిచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న ఈ మహోత్సవానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు.రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 25 లక్షల మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కోటప్పకొండ దిగువ భాగం లోని శివుని విగ్రహం వద్ద నుంచి చిలకలూరిపేట రోడ్డువరకు నిర్వహిస్తున్న మెగా సానిటేషన్ డ్రైవ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. తిరుణాళ్ళకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.అదేవిధంగా తాగునీరు, పారిశుద్ధ్య, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తిరుణాళ్ళ ప్రశాంతంగా, అవాంతరాలు లేకుండా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కోరారు.



# కలవకూరి కృపమ్మ ప్రథమ వర్ధంతి లో పాల్గొన్న జేఏసీ నాయకులు



**క్యాపిటల్ వాయిస్, త్రిపురాంతకం :-** ప్రకాశం జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కలవకూరి అబ్రహాం తల్లి కలవకూరి కృపమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని కందులాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృపమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబానికి చేసిన సేవలు, సమాజానికి చూపిన మానవీయ విలువలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కృపమ్మ జీవితం త్యాగం, ఓర్పు, సేవాభావానికి ప్రతీకగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి గ్రామస్తులు, అతిథులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా జేఏసీ నాయకులు పాల్గొని, కలవకూరి అబ్రహాం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా ఈ ప్రథమ వర్ధంతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.




**క్యాపిటల్ వాయిస్, కర్లపాలెం :-** భారతదేశంలో మానవ హక్కుల పరిరక్షణలో ఒక కీలక మైలురాయి అయిన వెట్టి చాకిరీ కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం,1976 అమలులోకి వచ్చి జూబ్లీ సంవత్సరం పూర్తయిందని,దీనిని పురస్కరించుకొని సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్, బాపట్ల వారి ఆధ్వర్యంలో కర్లపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు గోడ ప్రతులను ఆవిష్కరించి, మాట్లాడుతూ బానిసత్వం అనే అమానుష వ్యవస్థను రద్దు చేసి, కోట్లాది కార్మికులకు స్వేచ్ఛ,గౌరవం మరియు న్యాయాన్ని కల్పించడానికి భారత ప్రభుత్వం చారిత్రాత్మిక అడుగు వేసిందని, చట్ట ప్రకారం వెట్టి చాకిరీ కార్మిక వ్యవస్థ పూర్తిగా నిషేధించబడిందని,వెట్టి చాకిరీ కార్మికులపై ఉన్న అప్పులు రద్దు చేయబడి,వెట్టి చాకిరీ కార్మికులను పనిచేయించేవారికి చట్టపరమైన శిక్షలు విధించే ఏర్పాట్లు చేయబడ్డాయని, సమాజంలో ఇంకా ఎక్కడైనా కొనసాగుతున్న బంధిత కార్మికత్వాన్ని నిర్మూలించేందుకు ప్రతి పౌరుడు చైతన్యవంతుడై, మానవ గౌరవం,సమానత్వం, స్వేచ్ఛ విలువలను కాపాడేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాసరావు,ఏవో రజిని, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ( సిఫార్డ్ ) కోఆర్డినేటర్ బడుగు కిషోర్, కౌన్సిలర్ యమ్.నాగరాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వికాసం పరీక్ష ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

**క్యాపిటల్ వాయిస్,పల్నాడు జిల్లా,నరసరావుపేట :-** పదవ తరగతి విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, వారి ప్రతిభను వెలికితీసేందుకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన 'ప్రజ్ఞా వికాసం' పరీక్ష ప్రశ్నపత్రాలను ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీరావలి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూనే, పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ప్రతిభ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షల పట్ల ఉన్న ఆందోళనను తగ్గించుకోవాలని సూచించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాసం పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ముందస్తుగా ఒత్తిడిని జయించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్,ఎస్ఎఫ్ఐ నరసరావుపేట పట్టణ అధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శులు శ్రావణ్, వి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

